

పెరిగిన కందుల ధరలు

ధారూరు, జనవరి 20: ధారూరు వ్యవసాయ మార్కెట్‌లో శనివారం నిర్వహించిన బీట్లలో గత వారం కన్న ఈవారం కందుల ధరలు పెరిగాయి. గరిష్ఠంగా క్వింటాల్ కందులకు రూ.9,930, కనిష్ఠంగా రూ.9,850 ధర పలికింది. ధాన్యం సోనామసూరి రకం క్వింటాల్‌కు రూ. 2,900, వేరుశనగా క్వింటాల్‌కు రూ.7,200నుంచి రూ.7,450, మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.2,250 నుంచి రూ.2,360 వరకుకొనుగోలు చేశారని మార్కెట్ అధికారులు తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఎంపీ రంజిత్‌రెడ్డి దోచుకునేందుకే వచ్చాడు

- జిల్లాలో భూముల స్కాములన్నింటిలో పాత్రధారే ..
- కోళ్లదాణ, కోడిగుడ్ల కుంభకోణాలకు సూత్రధారి ఆయనే
- ఫిల్మ్‌నగర్, నానక్‌రాంగూడ, గోపన్నపల్లి భూకుంభకోణాల వెనుక పాత్ర ఆయనదే
- త్వరలో విచారణ సంస్థలకు ఫిర్యాదు చేస్తాం
- బీజేపీ నేతలు రత్నం, రవి యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి ధ్వజం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆస్తులు కొల్లకొట్టేందుకే వచ్చారని బీజేపీ నేతలు ఆరోపించారు. జిల్లాలోని పలు భూముల కుంభకోణాలతో పాటు రాష్ట్రంలో కోళ్లదాణ, కోడిగుడ్ల స్కామ్‌లకు ఆయనే సూత్రధారి అని ఆరోపణలు చేశారు. లక్డీకాపూల్‌లో శనివారం బీజేపీ నేత, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పాటు రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ రవియాదవ్ తదితరులు విలేకరుల సమావేశం నిర్వహించి ఎంపీ రంజిత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లు, దందాలు తప్ప ఆయన చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఏం అభివృద్ధి చేశారు?అనిప్రశ్నించారు. రంజిత్‌రెడ్డికి స్థానిక ప్రజల సమస్యలపై అవగాహన లేదు.. వాటిని పరిష్కరించాలనే ధ్యాసే లేదన్నారు. ఆయనకు తెలిసిందంతా మందిని బ్లాక్ మెయిల్ చేస్తూ రాజకీయ నేతలను కొనుగోలుచేసి భూములు కొల్లగొట్టడమేనన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా ఉన్నా ఆయన ఫాంహౌస్‌కు మాత్రం కొత్త రోడ్డు వేసుకున్నారని ఎద్దేవా చేశారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన నానక్‌రాంగూడ, గోపన్నపల్లి భూముల కుంభకోణాలతో పాటు ఫిల్మ్‌నగర్‌లో రూ.వందల కోట్ల విలువైన దేవాలయ భూములు కొల్లకొట్టిన వ్యవహారంలో కూడారంజిత్‌రెడ్డే సూత్రధారి అని విమర్శించారు. మాజీమంత్రి కేటీఆర్‌తో కలిసి హైదరాబాద్ శివార్లలో అనేకభూదందాలు చేశారని.. వీటన్నింటిపై తాము విచారణ కోరతామన్నారు. ఇక్కడ ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతుంటే ఈ ప్రాంతం నుంచి ఎన్నికైన పార్లమెంట్ సభ్యుడు రంజిత్‌రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి నోరు విప్పలేదన్నారు. స్వలాభం కోసమే రాజకీయాలు చేస్తున్నారన్నారు. 5 ఏళ్లలో ఒక్క ప్రాజెక్టు తీసుకు రాలేదని విమర్శించారు. చేవెళ్ల - ప్రాణహిత ప్రాజెక్టు రద్దుచేసినా, రంగారెడ్డి- పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు జరగకున్నా ఆయన ఎక్కడా ప్రశ్నించిన దాఖలాలు లేవన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వైఖరి వల్లే హైదరాబాద్-బీజాపూర్ హైవే పనులు నిలిచిపోయాయని, రోడ్డు విస్తరణ పనులు ఆగిపోతే ఎంపీ రంజిత్‌రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇంత అసమర్థ ఎంపీని తాము ఎక్కడా చూడలేదన్నారు. శంకరపల్లిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో స్థానికులకు అన్యాయం జరిగితే ఆయన ఎక్కడున్నారన్నారు. చేవెళ్లను మున్సిపాలిటీ చేస్తామని ఒక తప్పుడు పత్రం తెచ్చి స్థానికులను రంజిత్‌రెడ్డి వంచించారని నాయకులు విమర్శించారు.

నోరు అదుపులో పెట్టుకోకుంటే తగిన శాస్తి చేస్తాం

ఎంపీ రంజిత్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని బీజేపీ నేతలు హితవు పలికారు. వేరే జిల్లా నుంచి ఇక్కడకు వచ్చి కుయుక్తులు, డబ్బుతో రాజకీయం చేస్తున్న రంజిత్‌రెడ్డి ఇకనైనా నోరు అదుపులో పెట్టుకోకుంటే తగిన శాస్తి చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.రాజకీయాల్లో ఇలాంటి మూర్ఖులను తాను ఇంత వరకు చూడలేదని మాజీ ఎమ్మెల్యే రత్నం అన్నారు. ఇటీవల మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిపై రంజిత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల కిందట ఒక సర్పంచికి మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి ఫోన్ చేసి తమ పార్టీ సిద్ధాంతాలు నచ్చితే బీజేపీలోకి రావాలని కోరారని చెప్పారు. దీనిపై రంజిత్‌రెడ్డి స్పందించిన తీరు సిగ్గుచేటన్నారు. రంజిత్‌రెడ్డి దీనిపై విశ్వేశ్వర్‌రెడ్డికి ఫోన్‌చేసి సభ్యసమాజం తలదించుకునే రీతిలో మాట్లాడరన్నారు. రాజకీయాల్లో ఎలాంటి మచ్చలేని విశ్వేశ్వర్‌రెడ్డిపై పత్రికల్లో రాయలేని భాషను వాడారని.. దీన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేదిలేదన్నారు. ఈ విషయంలో రంజిత్‌రెడ్డిపై కేసు నమోదు చేసే యోచనలో తామున్నట్లు తెలిపారు.అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రజలంతా పండుగ చేసుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమం రోజైన 22న అనేక రాష్ట్రాలు సెలవుదినంగా ప్రకటించినందున రాష్ట్ర ప్రభుత్వం కూడా సెలవు ప్రకటించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, చేవెళ్ల కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, పరిగి నేత పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో నీటికష్టాలు తప్పేలా లేవు. ఈ ఏడాది పుల్లుగా వర్షాలు కురిసినా చాలాచోట్ల భూగర్భజలాలు అడుగంటాయి. విచ్చలవిడిగా నీటి వాడకం వల్లే ఈ పరిస్థితులు ఎదురయ్యాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నీటి లభ్యత సరిపోను లేకపోవడంతో పంటల సాగు కూడా దారుణంగా పడిపోయింది. ఏ జిల్లాలోనూ నలభై శాతానికి మించి పంటలు సాగు కాలేదంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే ఇంత దారుణ పరిస్థితి ఉంటే వేసవి కాలంలో నీటి కటకట మరింత తీవ్రమయ్యే ప్రమాదముందని ఉమ్మడి జిల్లావాసులు ఆందోళనకు గురవుతున్నారు.



వేసవికి ముందే.. ప్రమాద ఘంటికలు!

ఉమ్మడి జిల్లాలో శరవేగంగా అడుగంటుతున్న భూగర్భజలాలు

- వానాకాలంలో భారీ వర్షాలు కురిసినా కానరాని నీటి నిల్వలు
- యాసంగి సీజన్‌లో వర్షాలు అంతంతమాత్రం కావడంతో నీటి కష్టాలు
- నాలుగేళ్లలో కనిష్ఠస్థాయికి పడిపోయిన భూగర్భజలాలు
- విచ్చలవిడి నీటి వినియోగంతో తంటాలు
- శేరిలింగంపల్లిలో అత్యధికంగా 15.29 మీటర్ల లోతులో భూగర్భజలాలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భూగర్భజలాల పరిస్థితి ఆందోళన కరంగా ఉంది. వేసవికి ముందే భూగర్భజలాలు అడుగంటడంతో యాసంగి పంటలపై ప్రభావం పడే అవకాశం కనిపిస్తోంది. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రభావం ఉంది. గడిచిన నాలుగేళ్లలో ఎన్నడూ లేని రీతిలో భూగర్భజలాలు అడుగంటడంతో వేసవికి ముందే ప్రమాద ఘంటికలు మొగుతున్నాయి. వాస్తవానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గత ఖరీఫ్‌లో సాధారణానికి మించి భారీగా వర్షపాతం నమోదైంది. ఉమ్మడి జిల్లాలో గడిచిన వర్షాకాలం విస్తారంగా వర్షాలు పడడంతో చెరువులు, కుంటలు పూర్తిగా నిండిపోయాయి. పలు ప్రాంతాల్లో వరదలు కూడా వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో రికార్డుస్థాయిలో వర్షపాతం నమోదైంది. దీంతో వచ్చే వేసవిలో దండిగా భూగర్భ జలాలు ఉంటాయని అందరూ భావించారు. కానీ పరిస్థితి అంతా ఆశాజనకంగా కనిపించడం లేదు. కురిసిన వర్షపాతానికి భూగర్భ జలాలకు పొంతన లేదు. విచ్చలవిడిగా నీటి వాడకం పెరగడంతో శరవేగంగా భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. దీనికి కారణం రబీలో అంతంత మాత్రంగానే వర్షాలు కురవడంతో ఆశించిన స్థాయిలో భూగర్భ జలాలు పెరగలేదు. అనేక మండలాల్లో అక్టోబర్, నవంబర్ నెలల్లో కనిష్ట స్థాయిలో కూడా వర్షాలు పడలేదు. దీంతో ఈ మండలాల్లో వేసవిలో నీటి ఎద్దడి తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక మరికొన్ని మండలాల్లో వర్షపాతం బాగానే ఉన్నప్పటికీ విచ్చలవిడి నీటి వాడకం వల్ల వేసవికి ముందే భూగర్భ జలాలు అడుగుంటుతుండడం ఆందోళన కలిగిస్తోంది. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ మండలాల్లో కూడా ఈ పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా వికారాబాద్ జిల్లాలో భూగర్భ జలాల పరిస్థితి దారుణంగా ఉంది. అలాగే రంగారెడ్డి జిల్లాలో కూడా భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోతుండడంతో ఈ ఏడాది వేసవిలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. గడిచిన నాలుగేళ్లలో డిసెంబర్ నెలాఖరునాటి పరిస్థితులను పరిశీలిస్తే ఈ ఏడాదే ఆందోళన కరంగా ఉంది. డిసెంబరు నెలాఖరు నాటికి వికారాబాద్ జిల్లాలో సగటున 11.31 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. అలాగే రంగారెడ్డి జిల్లాలో 8.68 మీటర్లు, మేడ్చల్ జిల్లాలో 8.50 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. ఇక మండలాల వారీగా చూస్తే శేరిలింగంపల్లిలో భూగర్భ జలాలు శరవేగంగా పడిపోతున్నాయి. ఇక్కడ ఈ ఏడాది 31శాతం అధిక వర్షపాతం నమోదైనప్పటికీ భూగర్భజలాలు 15.29 మీటర్ల లోతుకు పడిపోవడం గమనార్హం.

2022 డిసెంబర్ -2023 డిసెంబర్ మధ్య భూగర్భజలాల వ్యత్యాసం

రంగారెడ్డి	-2.74
మేడ్చల్	-2.17
వికారాబాద్	-3.10

నాలుగేళ్లలో భూగర్భజలాల పరిస్థితి (డిసెంబరు ఆఖరు నాటికి) మీటర్లలో..

జిల్లా	2020	2021	2022	2023
రంగారెడ్డి	5.81	5.81	5.94	8.68
మేడ్చల్	6.10	7.81	6.33	8.50
వికారాబాద్	8.34	7.93	8.21	11.31

ఈ ఏడాది వర్షపాతం వివరాలు

జిల్లా	సాధారణం	కురిసింది	పెరుగుదల/ తగ్గుదల శాతం
రంగారెడ్డి	660.5	656	-1
మేడ్చల్	733.3	793.1	8
వికారాబాద్	730.7	824.7	13

యాసంగిలో కానరాని వర్షాలు

వానాకాలంలో లో మూడు జిల్లాల్లో వర్షాలు దండిగా పడినప్పటికీ యాసంగిలో కనీస స్థాయిలో కూడా వర్షాలు పడలేదు. దీంతోనే కష్టాలు మొదలయ్యాయి. వానాకాలంలో వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో సగటు కంటే 29శాతం అధిక వర్షపాతం నమోదు కాగా రంగారెడ్డి జిల్లాలో 19శాతం అధికంగా వర్షాలు కురిశాయి. అయితే రబీలో పరిస్థితులు తలకిందులయ్యాయి. రబీ సీజన్ ఆరంభమైన తరువాత వర్షాలు మోహం చాటేశాయి. దీంతో రబీ సీజన్‌లో మునుపెన్నడూ లేని విధంగా కరువు పరిస్థితులు తాండవిస్తున్నాయి. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో రబీ సీజన్‌లో సగటు కంటే 82శాతం తక్కువగా వర్షాలు పడ్డాయి. వికారాబాద్ జిల్లాల్లో 80 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది.

మూడు జిల్లాల్లో యాసంగి పంటల సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)

జిల్లా	సాధారణ సాగు	ఇప్పటివరకు సాగైంది	శాతం
రంగారెడ్డి	74,050	11,028	14.89
మేడ్చల్	10,132	3,331	32.88
వికారాబాద్	87,694	34,249	39.06

సాగు సజావుగా సాగేనా?

యాసంగి సీజన్ మొదలైన తరువాత వర్షాలు లేకపోవడంతో పంటల సాగుపై తీవ్ర ప్రభావం పడింది. రంగారెడ్డి జిల్లాలో యాసంగి సీజన్‌లో సాధారణంగా 74,050 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 11,028 ఎకరాల్లో మాత్రమే రైతులు పంటలు వేశారు. అంటే కేవలం ఈ సీజన్‌లో 14.89 శాతం మాత్రమే ఇప్పటి వరకు పంటలు సాగు చేశారు. అలాగే మేడ్చల్‌లో 32.88 శాతం, వికారాబాద్‌లో 39.06శాతం వరకు ఇప్పటి వరకు పంటలు వేశారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పోవడంతో యాసంగి సాగులో ఒడిదుడుకులు ఎదురవుతున్నాయి. దీంతో యాసంగి సీజన్‌లో ప్రధాన పంటల సాగు అంతంత మాత్రంగానే ఉంది. రంగారెడ్డి జిల్లాలో యాసంగిలో 52,470 ఎకరాల్లో వరి పంట సాగు చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు కేవలం 1,369 ఎకరాల్లో మాత్రమే పంట వేశారు. అయితే ఇంకా అనేకచోట్ల నారుమళ్లు నాటడానికి సిద్ధంగా ఉన్నాయి. అలాగే వికారాబాద్‌లో 45,620 ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 3,763 ఎకరాల్లో నాట్లు వేశారు. మేడ్చల్ జిల్లాలో 9,745 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,475 ఎకరాల్లో వరి వేశారు. వర్షాలు లేకపోవడంతో భూగర్భజలాల లభ్యతపై రైతుల్లో కూడా ఆందోళన నెలకొంది.



జాతీయ ఓటరు దినోత్సవానికి ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర ఎన్నికల సంఘం జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహ్మద్, కలెక్టర్ గౌతమ్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్

హాజరు కానున్న గవర్నర్ తమిళిసై

మేడ్చల్ జనవరి 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 25న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కూకట్‌పల్లి జెఎన్టీయూలో జరిగే కార్యక్రమానికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాష్ట్ర ఎన్నికల సంఘం జాయింట్ సీఈవో సర్ఫరాజ్‌అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, కలెక్టర్ గౌతమ్‌లు ఏర్పాట్లు, వసతులను పరిశీలించారు. జేఎన్టీయూ కాలేజీ ఆడిటోరియంలో గురువారం జరిగే గవర్నర్ కార్యక్రమానికి సంబంధించి పూర్తి ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఎలాంటి లోటు పాట్లు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. గవర్నర్ ప్రసంగించే సమయంలో సభావేదికతో పాటు పాల్గొనే వీఐపీలు కోసం వసతులను పరిశీలించారు. ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో అధికారులు అభిలాష్ అభినవ్, వెంకటేష్, ఆర్డీవో రాజేష్‌కుమార్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ఆల్ ది బెస్ట్.. బలరాం

- ప్రపంచంలో రెండో అతిపెద్ద మంచు పర్వతం అధిరోహించనున్న గిరిజన బిడ్డ

బొంరాస్‌పేట్, జనవరి 20: బొంరాస్‌పేట్ మండలంలోని సత్తర్‌కుంట తండాకు చెందిన బల్‌రాంరాథోడ్ సౌత్ అర్జెంటీనా దేశంలోనిమంచుపర్వతాన్ని ఆధిరోహించనున్నాడు. ప్రపంచంలోని రెండో ఎత్తైన మౌంట్ అకాంకగువా మంచు పర్వతం 6962 మీటర్లు (2,283 ఫీట్లు) అధిరోహించేందుకు ఇటీవల ఎన్నికయ్యాడు. 21 రోజుల పాటు మంచు పర్వతాల్లో సాగే ఈ ప్రయాణం కోసం శుక్రవారం శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరి వెళ్లాడు. ఈ సాహస యాత్రలో విజయం సాధించి ప్రపంచంలో తెలంగాణసత్తాను చాటి చెప్పాలని కొడంగల్ నియోజకవర్గ ప్రజలు, తండావాసులు ఆకాంక్షిస్తూ ఆల్ ది బెస్ట్ చెప్పారు.

చెత్త బండిలో ఆధార్ కార్డులు

- చౌడాపూర్‌లో తపాలా అధికారి నిర్వాకం



చౌడాపూర్‌లో లభ్యమైన ఆధార్ కార్డులు

కులకచర్ల, జనవరి 20: చౌడాపూర్ మండలకేంద్రంలో తపాల అధికారి నిర్లక్ష్యంతో ఆధార్, పాన్, ఏటీయం కార్డులు గ్రామపంచాయతీ చెత్త బండిలో ప్రత్యక్షమయ్యాయి. వందల సంఖ్యలో వచ్చిన ఆధార్, పాన్, ఏటీఎం కార్డులు ఇతర ఉత్తరాలు ప్రజలకు పంపిణీ చేయాల్సి ఉండగా, తపాలశాఖ అధికారి నర్సింహులు వాటిని శనివారం గ్రామపంచాయతీ చెత్త బండిలో పడేశాడు. చెత్తను డంపింగ్‌యార్డుకు తరలిస్తున్న క్రమంలో పారిశుధ్య కార్మికుడు సంచిలో చూడగా ఆధార్‌కార్డుల, పాన్, ఏటీఎం కార్డులు ఉండడంతో ప్రజలకు చెప్పడంతో నివ్వెర్యపోయారు. ప్రజలు వాటిని సేకరించి పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డికి అందించగా ఆయన తహసీల్దార్ ప్రభుకు అప్పగించారు. ఈ విషయంపై తహసీల్దార్ ప్రభు విచారణ చేపట్టారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తపాలశాఖ అధికారి నర్సింహులుపై చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. నర్సింహులు గత నెలలో మండల పరిధిలోని మందిపాల్ గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్ డబ్బుల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన విషయం విదితమే.

పారదర్శకంగా ఓటరు నమోదు ప్రక్రియ

కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 20: ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా బూత్ స్థాయి అధికారులు పని చేయాలని కలెక్టర్ నారాయణ రెడ్డి సూచించారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం సంగంలక్ష్మీబాయి ఉన్నత పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. ఓటరు నమోదు, ఓటరు ఐడీ కార్డులో చేర్పులు, మార్పులపై వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని బీఎల్‌వోలకు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా వస్తున్న దరఖాస్తులపై కలెక్టర్ బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ తో పాటు తహసీల్దార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సీఎంఆర్ టార్గెట్ వారంలో పూర్తి చేయాలి

వానాకాలానికి సంబంధించిన సీఎంఆర్ రైస్ టార్గెట్ వారం రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణ రెడ్డి సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వానాకాలానికి సంబంధించిన సీఎంఆర్ టార్గెట్‌పై రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాకు నిర్దేశించిన టార్గెట్‌కు కనుగుణంగా సీఎంఆర్ టార్గెట్లను పూర్తిచేసి అందజేయలన్నారు.మిల్లర్లు టార్గెట్ పూర్తి చేయనట్లయితే చర్యలు తప్పవన్నారు. పౌరసరఫరాల రైతులకు లాభం జరిగే క్రమంలో జిల్లా యంత్రాంగానికి తమ సహకారం కచ్చితంగా ఉంటుందని అన్నారు.సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, జిల్లా పౌరసరఫరాలాధికారి రాజేశ్వర్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలేశ్వర్ గుప్తా పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలి

నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వాసుపత్రిలో బయటి రోగులకు సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని వైద్యాధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. శనివారం వికారాబాద్‌లో నూతనంగా నిర్మాణం చేపడుతున్న ప్రభుత్వ ఆసుపత్రిని క్షేత్రస్థాయిలో సందర్శించి కాంట్రాక్టర్, అధికారులతో పనులపై కలెక్టర్ ఆరా తీశారు. వారం రోజుల్లోగా బయటి రోగులకు సేవలు అందించే దిశగా ఏర్పాట్లను సమకూర్చుకోవాలన్నారు.



బీఎల్‌వోలతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రైలులో 40కిలోల గంజాయి పట్టివేత

తాండూరు, జనవరి 20 : కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో 40 కిలోల గంజాయి నిఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. శనివారం భువనేశ్వర్ నుంచి పూణె వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌ను తాండూరులో తనిఖీ చేశారు. తమిళనాడు చెందిన పీటర్‌ఫ్రాన్సిస్ 40 కిలోల ఎండు గంజాయితో పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ అనంతయ్య తెలిపారు. ఒడిశా రాష్ట్రంలోని అటవీ ప్రాంతంలో కొనుగోలు చేసి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో పూణె తరలిస్తున్నట్లు విచారణకు తేలిందని తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరుచగా పరిగి సబ్ జైలు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో డీటీఎఫ్‌సీ ధన్వంత్‌రెడ్డి, ఎస్ఐ కోటేశ్వరరావు చంద్రకాంత్ రెడ్డి, చిన్నరాయుడు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి

23న పరిగిలో.. జాబ్‌మేళా

పరిగి/వికారాబాద్, జనవరి 20: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఈ నెల 23న పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నం:1 మైదానంలో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తామని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి షేక్ అబ్దుల్ సుభాన్ శనివారం తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ 50 కంపెనీల్లో ఐదువేల మందికి ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, ఎంబీఏ, ఎంసీఏ, బీఈ, బీటెక్ విద్యార్హత కలిగి ఉండాలని సూచించారు. వైద్య రంగం, మార్కెటింగ్, భవన నిర్మాణ రంగం, రీటైల్, మార్కెటింగ్, ఫైనాన్స్, అకౌంట్స్ తదితర కంపెనీల్లో ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చి ఉద్యోగాలిస్తారని వివరించారు. మరిన్ని వివరాలకు అభ్యర్థులు 9676947444/ 9182477163/6305197076 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు షెడ్యూల్ జారీ

● 24న తుది జాబితా ● 29న ఎన్నికలు

మేడ్చల్ జనవరి 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల విద్యా కమిటీల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యాశాఖ శుక్రవారం జారీ చేసింది. దీంతో శనివారం హెచ్ఎంలు నోటీసులు జారీచేశారు. దీంతో పాఠశాలల్లో ఎన్నికల కోలాహలం నెలకొంది. ప్రభుత్వ బడుల్లో చేపట్టే అభివృద్ధి, ఇతరత్రా కార్యక్రమాలపై నిర్ణయాలు తీసుకునే ఎస్ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలకు ప్రాధాన్యం సంతరించుకుంది. 2019 నవంబరులో విద్యా కమిటీ ఛైర్మన్ ఎన్నికలు జరిగాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 375 ప్రాథమిక, 22 ప్రాథమికోన్నత, 108 ఉన్నత పాఠశాలలు, 10ఎయిడెడ్ పాఠశాలలు మొత్తం 515 స్కూళ్లలో ఈ నెల 29న ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తారు. విద్యార్థుల తల్లిదండ్రుల పేర్లను పాఠశాల ఆవరణలో ప్రదర్శించారు. ఎన్నికల్లో పాల్గొనే తల్లిదండ్రుల జాబితాపై 22న అభ్యంతరాలు స్వీకరిస్తారు. 24న పోటీలోని తుది జాబితా ప్రదర్శిస్తారు. 29న ఉదయం 7 నుంచి ఒంటి గంట వరకు చేతులు ఎత్తే లేదా వాయిస్ విధానంతో ఎన్నిక నిర్వహిస్తారు. అదే రోజు కొత్తగా ఏర్పడిన కమిటీతో సమావేశం నిర్వహిస్తారు. ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ సహా ఒక్కో తరగతి నుంచి ముగ్గురు ఎన్నికైన తల్లిదండ్రులు సభ్యులుగా ఉంటారు. మరో ఐదుగురు ఎక్స్‌అఫీషియో, ఇద్దరు కో-ఆప్షన్ సభ్యులుంటారు. హెచ్ఎం కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. 1-8 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులే సభ్యులుగా ఉంటారు. 9, 10 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులకు పోటీకి అవకాశం లేదు. ఎన్నిక సమయంలో కనీసం 50శాతం మంది తల్లిదండ్రులు హాజరుకావాలి. హెచ్ఎం ఎన్నికను నిర్వహిస్తారు. ఎన్నికల్లో పొరపాట్లకు తావివ్వకుండా హెచ్ఎం చూడాలి.

కులకచర్ల: కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లోని పాఠశాలల్లో ఎస్ఎంసీల ఎన్నికకు ఎంఈవో హబీబ్ అహ్మద్ నోటిఫికేషన్ జారీ చేశారు. కులకచర్ల మండలంలో 9 ఉన్నత, 2యూపీఎస్‌ల, 59ప్రాథమిక, 1 కేజీబీవీ, 2 గిరిజన ఆశ్రమ పాఠశాలలున్నాయి. చౌడాపూర్ మండలంలో 8 ఉన్నత, 2 యూపీఎస్, 37 ప్రాథమిక, 1 గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఈ నెల 24న తుది జాబితా, 29న ఎన్నిక నిర్వహిస్తామని తెలిపారు.

18ఏళ్లు నిండినవారు ఓటరుగా నమోదవ్వాలి

కొడంగల్/కొడంగల్ రూరల్, జనవరి 20: 18ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు కోసం తమ పేర్లను నమోదు చేసుకోవాలని కొడంగల్ తహసీల్దార్ బి.విజయ్‌కుమార్ తెలిపారు. ఓటరు నమోదుకార్యక్రమంలో భాగంగా శనివారం ఇందనూర్, రావుల్‌పల్లి గ్రామాల్లో ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. ఇందనూర్ పోలింగ్ కేంద్రం 262, రావుల్‌పల్లి 259, 260 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఆయా గ్రామాల్లో ఓటరు నమోదుపై బీఎల్‌వోలతో అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మెట్లకుంటలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ పరిశీలించారు. ప్రస్తుత జనవరి 1 నాటికి 18ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. మెట్లకుంటలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదుపై బీఎల్‌వోలతో అడిగి తెలుసుకున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు ఇది అవకాశం అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్, రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

దోమ: కిష్టాపూర్ జెడ్పీ పాఠశాలలో విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులు పోలింగ్ విధానంపై అవగాహన కలిగి ఉంటేఓటుహక్కు వృథా కాదని హెచ్ఎం మహేంద్రబహదూర్, పీఆర్‌టీయూ



కొడంగల్: ఇందనూర్‌లో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

రాష్ట్ర నాయకుడు గోపాల్ తెలిపారు. టీచర్ భీమ్లానాయక్ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: గ్రామాల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటరు లిస్టుల్లో మార్పులు, చేర్పులుంటే ఫారం-8నింపి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు, బీఎల్వోలు పాల్గొన్నారు.

కీసర రూరల్: అర్హులందరూ ఓటు హక్కు కోసం పేర్లు నమోదు చేసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కొత్త ఓటరుగా నమోదుతో పాటు పాత ఓటర్లకు మార్పులు, చేర్పుల దరఖాస్తులకు ఆదివారంతో గడువు ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్, మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, బీఎల్వోలు పాల్గొన్నారు.

బషీరాబాద్ : ఈ ఏడాది జనవరి 1కి 18ఏళ్లు నిండిన వారంతా ఓటర్లుగా నమోదు కావాలని తహసీల్దార్ ఎస్.వెంకటస్వామి అన్నారు. పోలింగ్ కేంద్రంలో కొత్త ఓటర్ల నమోదు, అడ్రెస్ మార్పు, పేర్లలో తప్పుల సవరణ దరఖాస్తులకు ఆదివారం ఆఖరు గడువు అని తెలిపారు. ఫారాలతో బీఎల్వోలు అందుబాటులో ఉంటారని ఆయన చెప్పారు.

మేడ్చల్ టౌన్: మేడ్చల్‌లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఓటరు స్పెషల్ సమ్మరి రివిజన్ కార్యక్రమంలో ఓటరు జాబితాలో పేర్లను నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వరావు కోరారు. 18ఏళ్లు నిండిన వారు ఓటు కోసం పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

పరిగి: పరిగి, నస్కల్ గ్రామాల్లో బీఎల్‌వో కేంద్రాలను వికారాబాద్ ఆర్డీవో విజయకుమారి పరిశీలించారు. ఈ నెల 21న కూడా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. మండలాల్లో బూత్‌స్థాయి సహాయకుల నియమాకాలు చేపట్టాలని సూచించారు. తహసీల్దార్ ఆనంద్‌రావు, డీటీ మోహన్, పీఎస్ ఫారూక్‌హుస్సేన్, ఎం.రాజేందర్ ఉన్నారు.

చేవెళ్ల లోక్‌సభ స్థానాన్ని కైవసం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, జనవరి 20: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల స్థానాన్ని మరోసారి గెలిచేలా పనిచేయాలని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. శనివారం పెండ్లిమడుగు, నారాయణపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. గత ఎన్నికలను పక్కనబెట్టి కలిసికట్టుగా పనిచేసి ఎంపీ సీటును గెలవాలని సూచించారు.

ఏబీవీపీ పట్టణ అధ్యక్షుడిగా నరేష్ తేజ



ఏబీవీపీ వికారాబాద్ పట్టణ నూతన కమిటీ

వికారాబాద్, జనవరి 20 : ఏబీవీపీ వికారాబాద్ పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో పట్టణ అధ్యక్షుడిగా నరేష్‌తేజ, ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్, కార్యదర్శులుగా జగదీశ్, అనిల్, ఉపాధ్యక్షులుగా గోపించంద్, శివప్రసాద్‌కు సోషల్ మీడియా కన్వీనర్ గా కార్తీక్, సంజీవ్, వెంకటేష్‌లను నియామించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఏబీవీపీ విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తూ దేశం కోసం కూడా పోరాటం చేస్తుందని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి సమస్య ఉన్న ఏబీఈపీ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ హరీష్‌రావు, స్టేట్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ సాయి గణేష్ ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సమాచారం ఇవ్వనందుకే బహిష్కరణ'

తాండూరు రూరల్, జనవరి 20: తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సన్మానించే విషయమై తమకు సమాచారం ఇవ్వనందుకే తాము సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించామని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అన్నారు. మీడియాతో వారు మాట్లాడుతూ.. తమకు ఎమ్మెల్యే అంటే గౌరవం ఉందని, కావాలనే కొందరు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే సమయం ఇస్తే సర్పంచ్‌లు, ఎంపీటీసీలంతా కలిసి సన్మానిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాజప్పగౌడ్, రాములు, మదన్‌మోహన్, సాయిలు, నాగప్ప, ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి, వసంత్‌కుమార్, శాంతు, నాయకులు వెంకటయ్య, శంషొద్దీన్, శేఖర్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, జగదీష్ తదితరులున్నారు.

సమావేశంలో చర్చించిన సమస్యలను పరిష్కరించాలి



మండలం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పాల్గొన్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్, జనవరి 20 : మూడు నెలలకోసారి నిర్వహించే మండల సమావేశంలో చర్చించిన సమస్యలను పరిష్కరించేందుకు అధికా రులు కృషిచేయాలని ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి అన్నారు.శనివారం తాండూరు మండల పరిషత్‌లో ఎంపీపీ ఎస్.అనితగౌడ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. గ్రామాల్లో సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రూ.10కోట్ల ప్రభుత్వ నిధులతో యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తామన్నారు. అంతకుముందు ఉద్దండాపూర్ సర్పంచ్ కౌసలయ్యబాయి మాట్లాడుతూ.. తమ గ్రామ పాఠశాలల్లో టీచర్ల సంఖ్యను పెంచాలని కోరారు. కరన్‌కోట్‌లో జనాభా ఎక్కువగా ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీటీసీలు రాజ్‌కుమార్, శివకుమార్ కోరారు. చెంగోల్‌లో జెడ్పీ స్కూల్ ఆవరణలో రాళ్లగుట్టను తొలగించి విద్యార్థులకు క్రీడా మైదానాన్ని కల్పించాలని ఎంపీటీసీ రత్నమాల కోరారు. ఖాంజాపూర్‌లో రేషన్ డీలర్ సరైన సేవలందించడం లేదని రెవెన్యూ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ జి.లలిత తెలిపారు. ఎంపీటీసీల పదవీ కాలం ముగియనున్నందున ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని ఎల్మకన్నె ప్యాక్స్ చైర్మన్ రవీందర్‌గౌడ్ కోరారు. సమావేశంలో ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డి, తహసీల్దార్ తారాసింగ్, వైస్ఎంపీపీ స్వరూప, ఎంపీటీసీలు శాంత్‌కుమార్, రత్నమాల, సీతాబాయి, నర్సమ్మ, సర్పంచ్‌లు మేఘనాథ్‌గౌడ్, పద్మమ్మ, సౌభాగ్య, అనూష, సావిత్రిబాయి, విజయలక్ష్మి, జగదీశ్వర్, దశరథ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులతో రామహారం!



వికారాబాద్, జనవరి 20: వికారాబాద్‌లో ఆధ్యాత్మిక సేవా మండలి ఆధ్వర్యంలో శనివారం ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులు మానవహారం(రామహారం) నిర్వహించారు. ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ఎంఆర్‌పీ చౌరస్తా వరకు విద్యార్థులు మానవహారంగా జై శ్రీరాం..జై శ్రీరాం.. నినాదాలు చేశారు. రేపు అయోధ్యలో జరిగే బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమం గురించి తెలిసేలా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సేవా మండలి అధ్యక్షుడు రాజు, మాధవరెడ్డి, వెంకట, విద్యా సంస్థల ప్రతినిధులు జయదేవ్, శ్రీనివాస్, నాగయ్య, వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్, బసవరాజ్, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుమలేశ్ పాల్గొన్నారు.

మంద కృష్ణను కలిసిన మేడ్చల్ ఎమ్మార్పీఎస్ నేతలు



మేడ్చల్ టౌన్, జనవరి 20: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణను మేడ్చల్ ఎమ్మార్పీఎస్ నేతలు శనివారం మర్యాదపూరకంగా కలిశారు. ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించటంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కృష్ణను కలిసిన వారిలో జిల్లా ఎమ్మార్పీఎస్ యువమోర్చా పరశురాం, బాలకృష్ణ, శివబాబు, నర్సింహ పాల్గొన్నారు.

బీఎల్వోలకు సౌకర్యాలు కల్పించిన అధికారులు



డైట్ కాలేజీ వద్ద కింద కూర్చున్న బీఎల్‌వోలు

వికారాబాద్, జనవరి 20: శని, ఆదివారాలు ఓటర్ల జాబితాల్లో పేర్లు నమోదు, మార్పు చేర్పుల కోసం ప్రజల నుంచి 6, 7, 8 నంబర్ల ఫారాలు స్వీకరిస్తున్నారు. ఇందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్వోలతో స్పెషల్ క్యాంపెయిన్ డే చేపడుతున్నారు. అయితే వికారాబాద్‌లో బీఎల్‌వోలు చెట్ల కింద కూర్చొని విధులు నిర్వర్తించారు. సోషల్ మీడియాలో బీఎల్‌వోలకు సౌకర్యాలు కల్పించలేదని ప్రచారం కావడంతో అధికారులు వెంటనే కూర్చోవడానికి సౌకర్యాలు కల్పించారు. స్పెషల్ డ్రైవ్‌లప్పుడు ఎలాంటి సదుపాయాలు కల్పించడం లేదని బీఎల్‌వోలు తెలిపారు.

అభివృద్ధి పనులకు అధిక నిధులు : చైర్మన్



పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర రూరల్, జనవరి 20: అభివృద్ధి పనులకు అధిక నిధులు కేటాయిస్తున్నట్లు నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం 16వ వార్డులో రూ.6లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బద నపురం శ్రీనివాస్, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

దొరికిన మంగళసూత్రాన్ని అప్పగించిన రైల్వే టీటీ



వికారాబాద్, జనవరి 20: డిసెంబరు 30న లాతూరు రైలులో బెర్త్ బీ2లో ప్రయాణిస్తున్న సబిహ అనే మహిళ మంగళసూత్రాన్ని పడేసుకున్నారు. టీటీ వివేక్‌కుమార్ దాన్ని గుర్తించి ప్రయాణికులకు సమాచారం అందించారు. శనివారం వికారాబాద్ జీఆర్‌పీ రైల్వే స్టేషన్‌కు వచ్చి ఎస్సై శంకరయ్య ఆధ్వర్యంలో మంగళసూత్రాన్ని అప్పగించారు. టీటీకి కృతజ్ఞత తెలిపారు.

సంప్రదాయాలను కాపాడేందుకు భజన ప్రోత్సాహక కార్యక్రమాలు



మాట్లాడుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి

మోమిన్‌పేట్, జనవరి 20: సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు మండల కేంద్రాల్లో భజన ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. కొండా మాధవరెడ్డి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం రాత్రి మోమిన్‌పేట్‌లోని మాణిక్ ప్రభు ఆలయంలో నిర్వహిస్తున్న భజన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కె.మాధవరెడ్డి, ఎస్సై విఠల్‌రెడ్డి, మోమిన్‌పేట్ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శివరాజ్, రమేశ్, లక్ష్మారెడ్డి, ఆశిరెడ్డి, బూచన్‌పల్లి, కోటమర్పల్లి, చక్రంపల్లి, దేవవరంపల్లి భజన మండళ్లు పాల్గొన్నారు.

'బేటీ బచావో.. బేటీ పడావో' పోస్టర్ ఆవిష్కరణ



మేడ్చల్ జనవరి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఈ నెల 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని వారం పాటు కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లా సంక్షేమాధికారి ఎం.కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం కార్యక్రమ పోస్టర్‌ను అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య చేతులమీదుగా విడుదల చేసి బీబీబీపి ప్రతిజ్ఞ బ్యానర్‌పై సంతకాల సేకరణ నిర్వహించారు. డీఆర్వో హరిప్రియ, సీడీపీఓస్, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.కోటితో పరిగి ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి : ఎమ్మెల్యే

పరిగి, జనవరి 20: పరిగి ప్రభుత్వ ఆస్పత్రిని రూ.కోటితో అభివృద్ధి చేస్తున్నట్టు పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆస్పత్రిలో డాక్టర్, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. రోగులకు చికిత్స కోసం అన్ని రకాల పరికరాలు సమకూరుస్తామని ఎమ్మెల్యే తెలిపారు. మెడికల్ కళాశాలలో ఉండే స్పెషలిస్టులు వారానికోసారి పరిగికి వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఐదు బెడ్లతో ఐసీయూ కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. రోగుల వెయిటింగ్ హాల్‌కు రూ.10లక్షలు వెచ్చించి పూర్తిచేయిస్తామన్నారు. డాక్టర్లకు, సిబ్బందికి లీజర్ రూమ్, వాష్ రూములు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇక్కడే అన్ని రకాల వైద్య చికిత్సలందించేలా డాక్టర్లు, సిబ్బంది పనిచేయాలని సూచించారు. రూపాయి ఖర్చు లేకుండా వైద్యం అందిస్తామని తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌వో ప్రదీప్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజశేఖర్, వెంకటరత్నం, మాజీ సర్పంచ్ పార్థసారధి, నాయకులు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కె.హన్మంత్, ఎన్.రామకృష్ణ, ఇ.కృష్ణ, కౌన్సిలర్ శ్రీనివాస్, నాయకులు అశోక్, పాలాది శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలి



'స్వచ్ఛ్ తీర్థ్'లో పాల్గొన్న చైర్‌పర్సన్ దీపిక

మేడ్చల్ టౌన్, జనవరి 20: పారిశుధ్యపై ప్రజలు శ్రద్ధ వహించి మేడ్చల్‌ను స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని చైర్‌పర్సన్ దీపిక అన్నారు. శనివారం'స్వచ్ఛ్ తీర్థ్' కార్యక్రమాన్ని నిర్వహించి అయ్యప్ప ఆలయం వద్ద పనులు చేశారు. దీపిక మాట్లాడుతూ.. మేడ్చల్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకారం అందించాలన్నారు. వార్డుల్లో పారిశుధ్య పనులు చేపట్టి వీధులు, గల్లీల్లో ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మన్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను పక్కదారి పట్టించేందుకే శ్వేతపత్రం



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

పరిగి, జనవరి 20: ఆరు గ్యారంటీ పథకాలను పక్కదారి పట్టించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల అంశాన్ని తెరపైకి తెచ్చిందని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. శనివారం పరిగిలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఆరు గ్యారంటీ పథకాలతో పాటు, 420 హామీలను కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని, వాటిని ఎలా అమలు చేయాలో తెలియక అప్పులపై శ్వేతపత్రం నాటకానికి తెర తీసిందన్నారు. అన్ని రాష్ట్రాలు తెలంగాణ వైపు చూసేలా కేసీఆర్ అభివృద్ధి చేశారన్నారు. 40రోజులు కాకముందే కాంగ్రెస్ పాలనపై వ్యతిరేకత వచ్చిందన్నారు. మరో ఆరు నెలల్లో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల నీరు లక్ష్మీదేవిపల్లి, పరిగికి వచ్చేవన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటేలా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఓటమికి కారణాలను ఆత్మపరిశీలన చేసుకొని ముందుకు సాగుదామని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి అన్నారు. సమావేశంలో పరిగి మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ బి.హరిప్రియ, ప్యాక్స్ చైర్మన్ కె.శ్యాంసుందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఆర్.అంజనేయులు పాల్గొన్నారు.

పూడూరు: పూడూరు పరిధిలోని గల ఓ వ్యవసాయ క్షేత్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎంపీ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా తానే బరిలో ఉంటానని, కార్యకర్తలంతా రెండు నెలలు కష్టపడితే.. ఐదేళ్లు సేవలందిస్తానని ఆయన అన్నారు. కొప్పుల అనిల్‌రెడ్డి, ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ మేఘమాల, ప్రభాకర్‌గుప్తా, పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, అజీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు నియంత్రణలో సీసీఎస్‌ది కీలకపాత్ర : ఎస్పీ

వికారాబాద్, జనవరి 20: నేరాల నియంత్రణలో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ అధికారుల ముఖ్యపాత్ర పోషించాలని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. శనివారం తనిఖీల్లో భాగంగా సీసీఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ. సీసీఎస్ అధికారులకు జిల్లాలో జరిగే క్రైమ్‌లపై అవగాహన ఉండాలని, నేరస్థులపై నిఘా పెట్టాలన్నారు. అంతకుముందు రికార్డులను పరిశీలించారు. అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, బల్వంతయ్య, బాలస్వామి, వెంకటేశం పాల్గొన్నారు.

రాష్ట్ర రజక సంఘం చైర్మన్‌గా బస్వరాజు శంకర్

శామీర్‌పేట, జనవరి 20 : తెలంగాణ రాష్ట్ర రజక సంఘం చైర్మన్‌గా బస్వరాజు శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శామీర్‌పేటలో జరిగిన సంఘం సమావేశంలో శంకర్‌ను సంఘం చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. రజకుల అభివృద్ధి, హక్కుల సాధనకు కృషిచేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ శ్రీనివాస్, సంఘం నాయకులు సంపత్, జయరాం, శ్రీనివాస్, డి.రమేష్, కుమారస్వామి, కనకయ్య, సాయిలు, రవి, ఆంజనేయులు, పోతురాజు రాములు, పూసల సంపత్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు

మేడ్చల్ టౌన్, జనవరి 20: ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని మల్లారెడ్డి యూనివర్సిటీ డైరెక్టర్ ప్రీతిరెడ్డి అన్నారు. ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు మల్లారెడ్డి అగ్రికల్చర్ స్కూల్ ఆఫ్ సైన్స్ కళాశాలలో నిర్వహిస్తున్న కిసాన్ మహోత్సవం శనివారం ప్రారంభమైంది. ప్రీతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచానికి అన్నం పెట్టేది వ్యవసాయరంగమని, దాని అభివృద్ధికి పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. కొత్త పంటల ఉత్పత్తికి శాస్త్రవేత్తల కృషి అభినందనీయమన్నారు. వ్యవసాయంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఉత్తమ సేవలందించిన వారిని అవార్డులతో సన్మానించడం గొప్ప విషయం అన్నారు.

'రైతులకు నిరంతరం సాగునీరు'

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 20: రైతులకు నిరంతరం సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఇరిగేషన్ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్సీ) నాగేందర్ తెలిపారు. ఎదులాబాద్, నారాయణరావు చానెల్ కాలువను శనివారం ఈఎన్సీ పరిశీలించారు. లక్ష్మీనారాయణ చెరువు కట్ట తూమును, నారాయణరావు చానెల్ కాలువపై కల్వర్టులను అధికారులు పరిశీలించారు. వర్షాకాలంలో చెరువు తూమువద్ద కట్ట లీకేజీ కాగా మరమ్మతులు చేసిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో నారాయణరావు చానెల్ కాలువ, లక్ష్మీనారాయణ చెరువు మరమతుల కోసం నిధులు మంజురు చేసి పనులు చేస్తామని తెలి పారు. చెరువులు, కాలువలు, కుంటలను కబ్జాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ ధర్మ, ఎసీఈలు హైదర్‌ఖాన్, సంజూ, ఈఈ బన్సీలాల్, ఉషారాణి, జ్యోతి, పరమేష్ పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా మల్కయ్య, రవీందర్‌రెడ్డి

మేడ్చల్ జనవరి 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(టీయూడబ్ల్యూజే-ఐజేయూ) మేడ్చల్ జిల్లా నుంచి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా తోకల మల్కయ్య, రవీందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా ఎన్నికల అధికారి విజయకుమార్ శనివారం తెలిపారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల ఎన్నికలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నుంచి మల్కయ్య, రవీందర్‌రెడ్డి నామినేషన్ వేశారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా దీంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. మేడ్చల్ జిల్లా నుంచి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన మల్కయ్య, రవీందర్‌రెడ్డిలకు జిల్లా పాత్రికేయులు అభినందనలు తెలిపారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

తాండూరు, జనవరి 20 : తాండూరులో శనివారం జవహర్ నవోదయ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. దరఖాస్తు చేసిన విద్యార్థుల్లో 288 మంది పరీక్షలు రాయగా, 640 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. ప్రభుత్వ నంబర్ వన్, న్యూ నలంద, జూ.కాలేజీ, సెయింట్ మార్క్స్ హైస్కూల్ సెంటర్లలో పరీక్ష నిర్వహించారు.

క్రైం కార్నర్

వీధి కుక్కల స్వైర విహారం.. బాలుడికి గాయాలు

వికారాబాద్, జనవరి 20 : వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వికారాబాద్‌లో గుంపులుగా తిరుగుతూ ప్రజలను కరుస్తున్నాయి. శనివారం అత్తెల్లిలో సయ్యద్ జయాన్ అనే రెండేళ్ల బాలుడు ఇంటిముందు ఆడుకుంటుండగా కుక్కలు కరిచాయి. బాలుడిని తల్లిదండ్రులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. అధికారులు కుక్కల బెడదను నివారించాలని ప్రజలుకోరుతున్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం స్వాధీనం

కొడంగల్/దౌల్తాబాద్, జనవరి 20: వికారాబాద్ ఎస్పీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ జిల్లా ఇన్‌చార్జి ఎస్సై ప్రశాంత్‌వర్ధన్, సిబ్బందితో కలిసి శనివారం కొడంగల్, దౌల్తాబాద్ మండలాల్లో దాడులు నిర్వహించారు. కొడంగల్ మండలం కస్తూర్‌పల్లి శివారులో, దౌల్తాబాద్ మండలం అంతారం, గుముడాల్ గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారనే సమాచారంతో దాడులు నిర్వహించారు. 108 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. బియ్యాన్ని సివిల్ సప్లయీస్ డిప్యూటీ తహసీల్దార్ గణపతి సమక్షంలో పంచనమా నిర్వహించి కేసులు నమోదు చేశారు.

అపహరించిన సెల్‌ఫోన్ అప్పగింత

కొడంగల్ రూరల్, జనవరి 20: రుద్రారానికి చెందిన కురువ నరేశ్‌కు చెందిన సెల్‌ఫోన్‌ను 5నెలల క్రితం ఓ వివాహ కార్యక్రమంలో ఎవరో అపహరించారు. నరేశ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా హెడ్ కానిస్టేబుల్ శివరాములుగౌడ్ సీఐఆర్ యాప్ ద్వారా ట్రేస్ చేసి కర్ణాటక రాష్ట్రం ముధేల్ పరిధి పాకాల గ్రామంలో నరేశ్ ఫోన్ ఉందని గుర్తించారు. ఎస్సై భరత్‌రెడ్డి ఆదేశానుసారం హెడ్ కానిస్టేబుల్ అక్కడికి వెళ్లి ఫోన్‌ను స్వాధీనం చేసుకొని శనివారం కొడంగల్ పోలీస్‌స్టేషన్‌లో నరేశ్‌కు అందించారు.

సుభాష్‌నగర్ కాలనీలో కార్డెన్ సెర్చ్

వికారాబాద్, జనవరి 20: వికారాబాద్‌లోని సుభాష్‌నగర్ కాలనీలో శనివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. 200ఇండ్లలో సోదాలు చేసి సరైన పత్రాలు లేని 44బైక్‌లను, ఒక ఆటోను సీజ్ చేశారు. సరైన పత్రాలు చూపి వాహనాలను తీసుకెళ్లాలని వాహనదారులకు సూచించారు. కార్డెన్ సెర్చ్‌లో ఒక డీఎస్పీ, ముగ్గురు సీఐలు, ఏడుగురు ఎస్ఐలు, ఐదుగురు ఏఎస్ఐలు, 70 మంది కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. డీఎస్పీ నర్సిములు మాట్లాడుతూ.. ఎవరైనా గంజాయి అమ్మకాలు, కొనుగోళ్లు చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. తల్లిదండ్రులు చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని, హెల్మెట్ ధరించి బైక్‌లు నడపాలని చెప్పారు.

సంక్షిప్తంగా...

● **ధారూరు:** కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ముజఫర్ హుస్సేన్ తన సొంత డబ్బుతో ధారూరులో గల దివ్యాంగులకు బస్ పాసులు అందజేశారు. శనివారం 25మందికి బస్‌పాసులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుజ్జయ్యగౌడ్, కిరణ్ కుమార్, పీఎస్ అంజ్యా పాల్గొన్నారు.

● **పూడూరు:** మీర్జాపూర్ గ్రామాన్ని డీపీవో తరుణ్‌కుమార్ సందర్శించారు.గ్రామంలోని ప్రకృతి వనం, రోడ్డుకు పక్కన నాటిన మొక్కలను పరిశీలించారు. డీపీవో వెంట సుందర్ తదితరులున్నారు.

● **తాండూరు రూరల్:** నియోజకవర్గంలోని 269పోలింగ్ కేంద్రాల్లో శనివారం కొత్త ఓటర్ల నమోదుకు 281 దరఖాస్తులొచ్చాయని ఆర్డీవో శ్రీనివాసరావు తెలిపారు. నేడు కూడా పోలింగ్ స్టేషన్ల వద్ద దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

● **కొడంగల్:** మున్సిపల్ పరిధి గుండ్లకుంటలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. ఎంపీపీ ముద్దప్ప, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్ గ్రామస్థులతో కలిసి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** పోచారం ఐటీ కారిడార్ పోలీసు స్టేషన్ సీఐగా బి.రాజు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేసిన అశోక్‌రెడ్డి రాచకొండ కమిషనరేట్ వెళ్లారు. రాజు ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో పరిచయం చేసుకున్నారు.

● **కీసర రూరల్:** బ్యాంక్, సాకేత్ కాలనీల్లోని 11కేవీ ఫీడర్ల పరిధిలో ట్రీ కటింగ్, మరమ్మతుల కారణంగా దమ్మాయిగూడలోని పలు కాలనీలకు ఆదివారం విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. మెయిన్‌రోడ్డు, రాజిరెడ్డినగర్, లక్ష్మీనగర్ కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. జవహర్‌నగర్, అంబేడ్కర్‌నగర్, బీజేఆర్‌నగర్, గబ్బిలాలపేట, చెన్నపురం క్రాస్‌రోడ్డు, జవహర్ మెయిన్‌రోడ్డు, డొనాల్డ్‌తోట ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30గంటలకు వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే చక్రిపురం, ఎస్వీనగర్, విజయపురి కాలనీల 11కేవీ ఫీడర్ల పరిధిలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం12గంటల వరకు విద్యుత్ ఉండదని ఏఈ కామేశ్వర్‌రావు తెలిపారు.

● **వికారాబాద్:** మండల పరిధి గిరిగేట్‌పల్లి,మదన్‌పల్లి సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఆదివారం సరఫరా ఉండదని డీఈ సంజీవ్ తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

● **కులకచర్ల:** బాల్య వివాహాల నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ దేవి అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆడ పిల్లలకు 18సంవత్సరాలు నిండిన తర్వాతే పెళ్లి చేయాలన్నారు. చిన్నతనంలో పెళ్లి చేసేందుకు ప్రయత్నిస్తే డయల్ 100, 108కు సమాచారమివ్వాలన్నారు. బాల్యంలో పెళ్లిచేస్తే బాలికలు అనారోగ్యానికి గురవుతారన్నారు. టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

● **పరిగి:** పరిగికి చెందిన పీజీ విద్యార్థి ఏరువాక ఫౌండేషన్‌లో భాగంగా రాష్ట్రస్థాయి ప్రథమ స్థానానికి ఎంపికయ్యారు. రిటైర్డ్ టీచర్ బ్రహ్మయ్య కుమారుడు శివరామకృష్ణ ఎమ్మెస్సీ అగ్రికల్చర్‌లో సేంద్రియ వ్యవసాయ విధానాలు, పంచగవ్య ఉత్పత్తులపై కృషి చేస్తున్నారు. శనివారం నగరంలోని సీఎంఆర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులతో అవార్డుతో సన్మానాన్ని అందుకున్నారు.

● **పరిగి:** 22న నిర్వహించనున్న బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవానికి చేవెళ్ల ఎంపీ జి.రంజిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి కలిసి రూ.3లక్షల విరాళాన్ని నిర్వాహకులకు అందజేశారు.

తాండూరు: రేపు తాండూరులో ప్రైవేటు విద్యా సంస్థలు బంద్ పాటించనున్నాయి. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని పట్టణంలోని గోశాల సేవా సమితి ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తారు.

● **వికారాబాద్:**ఓటరు జాబితాలో డబుల్ ఓట్లు ఉన్న వారి ఇంటికి బీఎల్‌ఓలు వెళ్లి వెరిఫికేషన్ చేసి వారి ఆమోదంతోనే పేర్లు తొలగించాలని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. పులమద్ది 107, 108 పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అర్హులంతా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా బూత్ లెవెల్ అధికారులు చొరవచూపాలని సూచించారు. పోలింగ్ బూత్‌ల పరిధిలో ఓటు నమోదు శిబిరాలను ఆయన తనిఖీ చేశారు.

పేద ముస్లిం విద్యార్థులను ప్రోత్సహిస్తాం : ఎంపీ

తాండూరు/కొడంగల్ జనవరి 20: పేద ముస్లిం విద్యార్థులు ఉన్నత చదువు చదివితే ప్రోత్సహిస్తామని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. శనివారం తాండూరులో సమద్ ఫంక్షన్ హాల్‌లో ముస్లిం విద్యార్థులకు ఎంఐఎం పార్టీ తరుపున టూ ఇన్ వన్ గైడ్స్‌ను పంపిణీ చేశారు. ఎంపీ మాట్లాడుతూ.. ముస్లింలు చదువులో వెనుకబడి ఉన్నారని, వారి కోసం ఎన్నో గురుకులాలను సాధించామని చెప్పారు. ఉర్దూ కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వాలపై పోరాటాలు చేసి ఉన్నత విద్య కోర్సులను సాధించుకున్నామని తెలిపారు. ఎంఐఎం అధినేత అబ్దుల్‌హదీని తాండూరు షేర్‌గా అభివర్ణించారు.తాము ఎవరి విషయాల్లో జోక్యం చేసుకోమని, మా వద్దకు వస్తే ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సాజిత్ పాల్గొన్నారు. అసదుద్దీన్ ఓవైసీని ఎంఐఎం కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు గుల్షన్ అంబేద్కర్ చౌరస్తాలో సన్మానించారు.



ప్రసంగిస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ